# చిత్రకారుడి జీవితచిత్రం



రాజారావు నన్ను గుర్తు పట్టలేదు.
కనుబొమలుముడివేసి పరీక్షగా నా ముఖంలోకి చూశాడు.

"మీపేరు? అడిగాడు.

'ఆనంద్ "

"ఆ నం ద్ . యన్. ఆనందరావనుకుంటాను పూర్తి పేరు?" అతని కళ్ళల్లో సంతోషపు ఛాయలు కనిపించాయి.

"అవును గుర్తొచ్చానా ?" కుతూహలంగా అడిగాను.

"అరె నువ్వటోయ్ చంపావు పో ఏమిటిట్లా ఐపోయావ్? చిన్నప్పుడు బాగా బొద్దుగా వుండేవాడివి. ఇప్పుడేమిటి ఇంత చిక్కిపోయావు? " ఆశ్చర్యం ప్రకటించాడు,నన్నింకా పరిశీలనగా చూస్తూ—

"ఆఁ ఎమిటి విశేషం? ఊరు ఎట్లావుందో చూద్దామని వచ్చావా? మార్పేమీ లేదులే ఇప్పుడెక్కడా వుండటం? విజయవాడేనా?" అన్నాడు.

"ఆఁ విజయవాడలోనే."

"ఎం చేస్తున్నావ్?"

"ఓ ప్రైవేటు కంపెనీలో క్లర్కుగా "

"గుడ్ రా అలా హోటల్లో కూర్చుని మాట్లాడు కుందాం " అంటూ నావీపుమీద చేయివేసి ముందుకు నడిచాడు.

"అమ్మా నాన్నా అంతా బావున్నారా?" నడుస్తూనే అడిగాడు.

"నాన్నపోయారు రెండు సంవత్సరాలయింది?"

"అరే? ఏమిటి? ఏవఁన్నా జబ్బా?"

"ఆఁ కాన్సర్!"

"హుఁ ఇంతమంది డాక్టర్లు వుండీ కేన్సర్ని కుదర్చలేక పోతున్నారు గదా ఊఁ ఇంకా ఏమిటి సంగతులు? "

"ఏమున్నాయ్ నువ్వే చెప్పాలి —మన వూరి గురించి "

"ఈ వూరి గురించి నాకు మాత్రం ఏం తెలుసు గనుక నేనిక్కడ వుండటంలేదు. హైదరాబాదులోనే జాబ్ చేస్తున్నాను."

"హైదరాబాదులో వుంటున్నావా? నాకు తెలీదు .. ఎందులో పని చేస్తున్నావ్?"

"స్టేట్ బ్యాంకులో."

"అట్లాగా అదృష్టవంతుడివి "

హోటల్లో ఓమూలగా వెళ్ళికూర్చున్నాం

హోటల్ ఇదివరకటికన్నా బావుంది. ఇదివరకు దీని స్థానంలో చిన్న కాకా హోటల్ వుండేది.

ఇంతకు ముందు మా వూరికి సినిమా హాలు కూడా వుండేదికాదు. చిన్న టూరింగ్ టాకీసు అప్పుడప్పుడూ వంచేస్తుండేది. ఏవైఁనా వూరు కొదిగా మారిందనే అనుకోవాలి కానీ రాజారావుకి ఈ మార్పేమీ ఆనటంలేదు. అవును మరి—అతనుంటున్నది హైదరాబాదులో,

రాజారావు ఆప్యాయంగా పలుకరించటం నాకు చాలా సంతోషంగావుంది . ఇంకా పాత మిత్రులెవరూ కనిపించలేదు. బస్సుదిగటంలోనే—కిళ్ళీకొట్టు దగ్గర సిగిరెట్టు కాలుస్తున్న రాజారావు కనిపించాడు.

స్వీట్ కు ఆర్డరిచ్చాడు రాజారావు, వద్దంటున్నా వినకుండా.

పామర్తి రాజేంద్రప్రసాద్

# మనిషి | గొడుగు | దర్పణం

"పిల్లలెంతమంది?" అడిగాడు.

"నలుగురు"

"ఊఁ బోర్డర్ దాటావన్నమాట ఇంకా ఎక్కువ దూరంపోయేవు! నాకు ఇద్దరే ఇద్దరు ఒక 'క్రెడిట్టూ'—మరో 'డెబిట్టూ'" నవ్వుతూ అన్నాడు, తను బేంకు ఎంప్లాయీనని గుర్తుచేస్తూ.

నేనూ నవ్వాను.

స్వీట్ తెచ్చి ముందర పెట్టాడు, సర్వర్. మెల్లగా నంజుతూ అసలు విషయం బయట పెట్టాను

"పల్లవరావుని చూడాలని వచ్చాను"

"పల్లవరావెవరూ ఓహో ఆర్టిస్టు గదూ క్లాసులో పాఠాలు వినకుండా బొమ్మలు గీస్తూండేవాడు"

"అతను ఏం చేస్తున్నాడు? వున్నాడా?" ఆసక్తిగా అడిగాను.

"ఏమో నాకేం తెలుసు? నేనీవూరొచ్చి రెండ్రోజులే ఐంది. మీరిద్దరూ మంచి ఫ్రెండ్సనుకుంటాను"

"ఆఁ చాన్నాళ్ళ క్రితం ఉత్తరాలన్నా రాస్తూండేవాడు ఇప్పుడు అదీలేదు! ఏం చేస్తున్నాడో పాపం చాలా పూర్ ఫేమిలీ వాళ్ళది! ఐనా ఏం. బ్రహ్మాండమైన ఆర్ట్ వాడిచేతిలో వుంది. ఎప్పటికైనా పైకొస్తాడు. అదెలాగూ తప్పదు."

"నిజంగా ఆర్టనేది గాడ్స్‌గిఫ్ట్ అందరికీ రాదు?" కాఫీతాగుతూ అన్నాడు రాజారావు. 'కరక్ట్' అన్నట్లు తలవూపాను.

"మంచి పిక్చరాడుతోంది. వెళ్దామా? టైముందిప్పుడే ఎనిమిదింటికి మొదలెడ్తారు."

"సారీ ముందు పల్లవరావుని చూడాలి. వీలైతే ముగ్గురం 'సెకెండ్షో'కి పోదాం"" అన్నాను కాఫీ తాగటం పూర్తిచేసి.

"సెకెండ్‌షో నమ్మకాలుండవ్ జనం పోగయితేనే వేస్తారు సరే కానివ్వు. అంతగా ఐతే రేపు వెళ్దాం వుంటావు గదూ రెండ్రోజులు?"

"చెప్పలేను" అంటూ లేచాను.

"వన్‌సిక్స్టీ" అరిచాడు సర్వర్.

నేనివ్వబోతుంటే వారించాడు రాజారావు.

ఇద్దరం బయటికొచ్చాం. ఇంకో పది నిముషాలసేపు కబుర్లాడాం రోడ్డుమీదే. అతనేదో మాట్లాడాడే కానీ, నాకేమీ అర్థంకాలేదు. నా ఆలోచనలన్నీ పల్లవరావు చుట్టూ తిరుగుతున్నాయి. వాడ్ని చూడాలని నా మనస్సు తహతహలాడుతోంది.

"సరే వెళ్లిరా ఐతే సినిమాకు రేపెళ్దాం" అంటూ అక్కడే ఆగిపోయాడు రాజారావు. నేను ముందుకు నడిచాను.

పల్లవరావు వాళ్లిల్లు వూరి చివర. బస్టాండు నుంచి కొద్దిగా దూరం. గబగబా నడక ప్రారంభించాను. దారిన తెలిసిన వాళ్లు చాలామంది కనిపించారు. ఐతే ఎవరూ నన్ను గమనించలేదు. గమనించినవాళ్లు గుర్తుపట్టలేదు. నేను కూడా పలకరించలేదు, కబుర్లలో పడితే ఆలశ్యం ఔతుందని! రేపెప్పుడైనా మాట్లాడొచ్చునని తలవంచుకొని నడవడం మొదలెట్టాను.

బాగా చీకటి పడిపోయింది. వీధిలైట్లు అక్కడొకటీ, అక్కడొకటీ వెలిగాయి. వూరి చివర బంగళాను సమీపించాను. బంగ

(డూడిల్స్)

# కలువు చంద్ర కలము

శాకు దగ్గర్లోనే పల్లవరావు ఇల్లు. అక్కడన్నీ పూరి గుడిశలే ఎక్కువ. పెంకుటిళ్లు విసిరి వేయబడ్డట్లు ఒకటో అరో వున్నాయి.

రోడ్డుమీద నిలబడి పరిశీలనగా చూశాను. పల్లవరావు వాళ్లింటి స్థానంలో—శిథిలావస్థలో వున్న చిన్న పెంకుటిల్లు కనిపించింది. బయట తలుపులు మూసివున్నాయి. దగ్గరకెళ్లి మునివేళ్ళతో చప్పుడు చేశాను. వెంటనే తెరుచుకున్నాయి.

"ఎవరు కావాలి నాయనా " ఒక నడి వయసావిడ.

"పల్లవరావున్నాడా?" అడిగాను.

"ఏ పల్లవరావూ "

"చలపతిరావుగా రబ్బాయి."

"చలపతిరావు గారెవరూ? ఎక్కడని చెప్పారు?"

"ఇక్కడే . ఇదే వీధిలో—ఈ ఇల్లే "

ఇంతలో ఓ ముసలాయన వచ్చాడు లోపలి నుంచి-"ఎవరు కావాలండీ" అంటూ.

"ఎవరో చలపతిరావట " సమాధానం చెప్పింది ఆమె.

"మీరెవరు బాబూ " అడిగాడాయన.

"నాపేరు ఆనందరావు."

"అలాగా లోపలికి రండి."

వెళ్లాను.

విరిగిపోయిన కుర్చీ ఒకటి చూపించి కూర్చోమన్నాడు.

"ఫరవాలేదండీ వాళ్లెక్కడుంటున్నారో చెబితే—త్వరగా వెళ్లి కలుస్తాను" అన్నాను కూర్చోవటానికి ఇబ్బంది పడుతూ.

"పెబూవాను ముందు కూర్చోండి " ఆయన పక్క మంచం వాల్చుకొని కూర్చున్నాడు. నేను భయం భయంగా విరిగిన కుర్చీలో ఒదిగి కూర్చున్నాను.

"చలపతి మీకేమౌతాడు?"

"వాళ్ళబ్బాయి పల్లవరావు నా స్నేహితుడు"

"అః హః చలపతి చనిపోయి రెండు సంవత్సరాలవుతోంది."

కలవరపడ్డాను.

"యాక్సిడెంటైంది లారీ క్రింద పడ్డాడు. పాపం, చాలా మంచివాడు. నాకు మంచి స్నేహితుడు మీకీ విషయం తెలీదేమో వాళ్ళబ్బాయి చలపతి చనిపోక ముందే ఎవ్వరికీ చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయాడు."

ఏమిటిగుపాటు!

నమ్మలేకపోయాను మొదట.

" మీరు చెప్పేది నిజమా ఐతే పల్లవా ఇక్కడ లేడా? " అంతకన్నా ఎక్కువ మాట్లాడ లేకపోయాను.

ఆయన తలవంచేసుకున్నాడు.

నాలో ఉత్సాహమంతా చప్పగా చల్లారి పోయింది. ఎంత ఆశతో వచ్చానో—అంత నీరసపడిపోయాను—ఆ మాట వినడంతోనే. ఇట్లా జరుగుతుందని వూహించలేకపోయాను.

నేనింకా ఏవేవో వూహల్లువున్నాను.

నన్ను చూడగానే పల్లవా అమాంతంవచ్చి కౌగలించుకున్నట్లూ—

ఇద్దరం కలిసి ఊరంతా తిరిగొచ్చినట్లూ—

అర్ధరాత్రివరకూ ఏవేవో కబుర్లు చెప్పుకున్నట్లూ—

చిన్ననాటి సంఘటనల్ని నెమరు వేసుకున్నట్లూ—

—ఇంకా ఏవేవో అనుకున్నాను. కానీ—
ఇప్పుటిలా? .. .

నిజమే ...సరిగా మూడు సంవత్సరాల నుంచీ పల్లవరావు దగ్గరనుంచి ఉత్తరాలు రావడం ఆగిపోయాయి.

"ఇప్పుడెక్కడుంటున్నాడో మీకేమైనా తెలుసా? . అతనికోసమే ఇంతదూరం వచ్చాను."

"వివరాలు మాకేమీ తెలీవు . పాపం వాళ్ళ నాన్న అతన్ని తలుచుకొని ఎంతగానో కుమిలిపోయేవాడు. అతను పోయిన దిగులు తోనే చిక్కి సగమయ్యాడు. వాళ్ళమ్మ మరీను. ప్రతిరోజూ అతనికోసం విలపించేది? ఆ సమ యంలోనే మేమీ వూరొచ్చాం. ఇంతకుముందు కరణంగారి వీధిలో వుంటుండే వాళ్ళం. ఈ ఇంట్లోకివచ్చి ఆరునెల్లే ఐంది. వాళ్ళమ్మగారు ఈ ఇంటిని మాకు అమ్మకం చేశారు."

"ఆవిడ ఎక్కడుంటున్నదో "

"వాళ్ళన్నగారి దగ్గర వుంటోంది, బంద రులో. వూరైతే తెలుసునుగానీ — అడ్రసు మాత్రం తెలీదు. అడ్రసు లేకుండా ఎక్కడని వెదుకుతారు మీరు మాత్రం? అసలు వాళ్ళ బ్బాయి గురించి ఆవిడకూడా వివరాలేమీ తెలీవు. ఎట్లా తెలుస్తాయి? కనీసం ఉత్తరం ముక్కయినా రాసి పడేస్తేగా అతను?"

"సరే . థాంక్సండీ మీకు శ్రమ కలిగిం చాను." అంటూ లేచి నిలబడ్డాను. ఆయన కూడా లేచాడు.

"పాపం. స్నేహితుణ్ణి చూడాలని చాలా ఆశతో వచ్చినట్లున్నారు." అన్నాడు నిట్టూ ర్పుతూ.

"వెళ్లొస్తానండీ—"

"మంచిది బాబూ."

రోడ్డుమీదకు వచ్చేశాను. ఇంతకు ముందు ఎంత వేగంగా వచ్చానో — అంత నీరసంగా అడుగులు పడుతున్నాయి.

మనసంతా దిగులుతో నిండిపోయింది. పల్లవరావు నాకెంతో ప్రియమైన స్నేహితుడు మరి. అట్లాంటివాడు దారీతెన్నూ లేకుండా ఎక్కడికో పోయాడంటే ఎంతబాధ? ఎంత గుండెకోత?

పల్లవరావుని నేను 'పల్లవా' అని పిలిచే వాణ్ణి. మేమిద్దరం ఎలిమెంటరీ స్కూలు రోజులనుంచీ మంచి స్నేహితులం. పల్లవాకి ఎక్కువమంది స్నేహితుల్లేరు. కారణం వాడు ఎవరితోనూ కలవడు. ఎవరితోనూ మాట్లా డడు కూడా. చిన్నప్పట్నుంచీ చాలా 'రిజర్వ్డ్ డు'గా వుండేవాడు. తన పనేదో తను చేసుకు పోతుండేవాడు.

వాడు క్లాసులో పాఠాలు వినగా నేనెప్పుడూ చూడలేదు. ఓ మూలన కూర్చుని చదువు తున్నట్లుగానో, రాస్తున్నట్లుగానో నటిస్తూ బొమ్మలు గీస్తూండేవాడు.

పల్లవరావు బొమ్మల్ని అందరూ మెచ్చు కునేవారు. చిన్న వయసులోనే అంత అద్భు తంగా బొమ్మలు గీయటం ఎవరికైనా ఆశ్చ ర్యంగానూ, అబ్బురంగానూ వుంటుంది.

వాడికున్న కొద్దిమంది స్నేహితులూ వాడిలోవున్న ఆ గొప్ప 'కళ'కు ఆకర్షింపబడే దగ్గిరయ్యారు. స్కూల్లో టీచర్లందరూ కూడా పల్లవరావుని బాగా 'లైక్' చేసేవాళ్ళు.

హైస్కూల్లో చదివేటప్పుడు అక్కడి హెడ్మాష్టరుగారు పల్లవరావుని ఎంతో అభి మానించేవారు. వాడి ద్వారా మా స్కూలికి చాలా ప్రైజులు వచ్చాయి: ఆ వయస్సులోనే వాడు ఎన్నో ఎగ్జిబిషన్సులో పాల్గొన్నాడు. హైస్కూలు స్థాయిలో జరిగే ప్రతి చిత్ర కళా పోటీకి పల్లవరావు వెళ్ళేవాడు.

ఓ సంవత్సరం మాస్కూలు యాన్యువర్సరీ ఫంక్షను రోజు హెడ్మాష్టరు రిపోర్టు చదువుతూ స్కూలు గెలుచుకున్న బహుమతులను గురించి వివరిస్తూ—

"వర్ధమాన చిత్రకారుడు పల్లవరావు మా స్కూలు విద్యార్థి ఐనందుకు గర్విస్తున్నాను. మా స్కూలు తరఫున ప్రతి చిత్ర కళా పోటీ లోనూ అతను ఎంతో ఉత్సాహంతో పాల్గొని టౌన్‌లోవున్న పెద్ద పెద్ద హైస్కూల్సుని సైతం ఓడించడంవల్ల, మా విద్యా సంస్థకు

ఓ రకమైన గుర్తింపు కలిగింది. పల్లవరావు మాకు సాధించిపెట్టిన విజయపరంపరను మేము మర్చిపోలేము. అతి చిన్న వయస్సులోనే ఇంత మంచి కళాకారుడయ్యాడంటే ముందు ముందు ఎంతో అభివృద్ధిలోకి వచ్చి గొప్ప పేరు గడిస్తాడనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ప్రతి విద్యార్థి కూడా పల్లవరావుని ఆదర్శంగా తీసుకొని కృషిచేస్తే మంచి ఫలితాన్ని పొందగలుగుతారు. మన స్కూలుకు మరింత పేరును తీసుకురాగలుగుతారు."

అంటూ పల్లవరావు ప్రతిభను పదిమంది లోనూ గొప్పగా చెప్పారు.

కాలేజీలోకూడా వాడు చాలాపేరు తెచ్చుకున్నాడు.

మంచి ఆర్టిస్టుగా కాలేజీలో ప్రతి ఒక్కరికీ వాడు తెలుసును. అక్కడకూడా ప్రిన్సిపాల్ గారు వాడిని ఎంతగానో అభిమానించేవారు. కాలేజీకి కప్పులు కొట్టుకొచ్చే స్టూడంట్సుని ఏ ప్రిన్సిపాల్ అభిమానించడు కనుక?

ప్రతిచోటా ఇంత ఇదిగా పల్లవరావు పేరు ప్రకాశిస్తున్నా-వాడు మాత్రం తనకేమీ పట్టనట్లుగానే 'కామ్'గా వుండేవాడు. కొత్తవాళ్ళనీ, పెద్ద వాళ్ళనీ పరిచయం చేసుకోడానికి ఉత్సాహం చూపించడు. ఎంతసేపటికీ వాడేమిటో వాడి లోకమేమిటో! నలుగురికీ దూరంగా, ఏకాంతంగా వుండటానికే ప్రయత్నిస్తూండేవాడు!

వాడి చూపులు ఎక్కడో ఆలోచిస్తూ-ఏదో వెదుకుతున్నట్లు వుంటాయి. సామాన్యులకు కనిపించని ఏదో అదృశ్య శక్తిని దర్శిస్తున్నట్లూ, మనం చూడలేని మనోహర లోకాలను తను చూస్తున్నట్లూ తన్మయత్వం చెందుతూంటాడు. అతిపొడవుగా వుండే సున్నితమైన వాడివేళ్ళు అనుక్షణంనాట్యంచేస్తూనేవుంటాయి! బహుశా ఏదో సుందర రూపాన్ని వూహించుకుంటూ గాలిలో వేళ్ళతోనే గీతలుగీస్తూ వింత అనుభూతిని చెందుతూంటాడనుకుంటాను.


ఇంటర్ సెకెండియర్లో ఎవ్వరికీ చెప్పా చెయ్యకుండా కాలేజీ మానేశాడు పల్లవరావు. కారణం ఏమిటో ఎవరికీ తెలీదు.

ఎంత గుచ్చిగుచ్చి అడిగినా నాకే చెప్పలేదు. మరీ వత్తిడిచేస్తే-"ప్రత్యేకంగా కారణమంటూ ఏమీలేదు. నేను చదవలేను. నా చదువుసాగదు. నాకు వంటబట్టదు. అంతకుమించి చెప్పలేను." అన్నాడు విరక్తిగా.

"ఏమిటో అర్థంకాని మనిషి"అనుకున్నాను ఏమీచేయలేక. వాడు ఒక నిర్ణయమంటూ తీసుకుంటే ఇక దానికి తిరుగుండదు. ఎంత మంది చెప్పినా ప్రయోజనం వుండదు. అసలు ఎవరూ చెప్పడానికి సాహసించరు. అంతగంభీరంగా కనిపిస్తాడు మనిషి.

"నువ్వూ. ఆనందరావ్వికదూ."రోడ్డుమీదే ఆగిపోయాను, ఆలోచనల్ని అంతటితో ఆపి. అతన్ని సులభంగానే గుర్తుపట్టాను. అతని

(వి)చిత్ర విజ్ఞానం



అమెరికాలోని ఓ కంపెనీ సైకిలుకు తెరచాపలు నిర్మిస్తున్నది. ఈ తెరచాప పాలితీన్‌తో తయారు చేయబడినది. దీనిని హాండిల్ బార్‌కు తగిలించుకోవచ్చు. మనకి అనుకూలమైన దిక్కువైపు గాలి వీస్తున్నప్పుడు యీ తెరచాపను గొడుగు విప్పినట్లుగా విప్పి ఉపయోగించుకోవచ్చు. గంటకు 15 మైళ్ళ వేగంతో వీస్తున్న గాలిలో, యీ తెరచాప సాయంతో గంటకు 22 మైళ్ళ వేగంతో సైకిలు దూసుకుపోతుందని అంచనా. ఈ తెరచాపపేరు "వైకింగ్ బైసికిల్ సెయిల్." దీన్ని తయారుచేసే కంపెనీ విలాసము,

**Turtel Leisure Products, 206 Quentin Road, Brooklyn, NewYork 11223!!**

పేరు కిషన్!

"అవును ఆనందరావునే. బావున్నావా?" ప్రశ్నించాను.

"ఆఁ ఏమిటి చాలాకాలానికి వచ్చావు? మమ్మల్ని మర్చిపోయినట్లున్నావ్? ఎవరింటి కొచ్చావ్?"

చెప్పాను-క్లుప్తంగా.

"అవును, పల్లవరావు ఇక్కడ లేడుగా. బొంబాయిలో వుంటున్నాడు?"

నా ఆశ్చర్యానికి అంతులేదు!

"పల్లవరావు బొంబాయిలో వుంటున్నాడా?" నమ్మలేనట్లు అడిగాను.

"వాడికేమోయ్. సినిమాల్లో చేరిపోయాడు. ఎవరో పెద్ద ఆర్టు డైరెక్టర్ దగ్గర సహాయకుడిగా పంచేస్తున్నాడు. రేపో మాపో తనే ఓ ఆర్ట్ డైరెక్టర్ కాబోతున్నాడు.

"ఏమిటి నువ్వనేది నిజమా?" నమ్మలేక అడిగాను.

"నిజమే. ఎవ్వరికి చెప్పకుండా పోతే పోయాడు కానీ-వెళ్లి మంచి పనేచేశాడు. ఎప్పటికైనా కష్టపడ్డవాడు పైకిరాక తప్పదు కదా. నువ్వేదో పాత స్నేహితుడ్ని గుర్తుంచుకొని-పిచ్చిగా అతన్ని చూట్టానికి వచ్చావు. కానీ ఈరోజు నువ్వు బొంబాయి వెళ్తే 'నువ్వెవరో నాకు తెలీదంటాడు. ఆమాట అనకపోయినా కనీసం నిన్నుచూసి గుర్తుపట్టలేడు.

నాకెంతో సంతోషం వేసింది, పల్లవా ఓదారిలో పడి మంచి స్థితికి రాబోతున్నందుకు.

కానీ పల్లవా అంతతేలిగ్గా మరిచిపోలేడు నన్ను. మా స్నేహం అట్లాంటిది. మా స్నేహం గురించి కిషన్‌కేం తెలుసని? అయినా మనుషుల్ని అంత త్వరగా మరిచిపోయే స్వభావం కాదు పల్లవాది. నాకు బాగా నమ్మకం. నా నమ్మకం ఎప్పుడూ వమ్ముకాదు.

కిషన్ ఇంకేదో చెప్పుకు పోతున్నాడు. మౌనంగా వింటున్నాను. పల్లవా గురించి ఇంకా చాలా చెప్పాడు. అవన్నీవింటూ ఉప్పొంగిపోయాను.

"సినీ ఫీల్డులో ప్రవేశించడం నిజంగా వాడి అదృష్టమోయ్. నిజానికి పల్లవరావు మామూలు సమాజంలో చలామణికాలేడు. అట్లాంటి తత్వం వాడిది. నోరు తెరిచి అడగందే అమ్మ ఐనా అన్నంపెట్టదు కదా. అట్లా అడగటానికి కూడా నోరులేదు వాడికి. ఎంతసేపటికీ కళారాధనా, కళాసేవ అనుకుంటూ కూర్చుంటే పొట్టగడవదు కదా. మన కళారాధన చూసి ఎవ్వడూ సంతోషించడు. పైగా పిచ్చోడని నవ్వుకుంటారు. దూరంగా తరిమేస్తారు! ఎంతకీ నాలుగు మాటలు చెప్పగలిగినవాడే 'టేలెంట్' లేకపోయినా బ్రతగలడు కానీ, అమోఘమైన టాలెంటువుండీ మాటలు చెప్పడం రాకపోతే-అట్లాంటివాడు 'అన్‌ఫిట్ ఫరెనీథింగ్.' అందుకే అంటారు కాకారాయుళ్ళకున్న విలువ కళాకారులకులేదని.

"మొదట నేననుకునేవాణ్ణి-పద్మవ్యూహం లాంటి ఈ సమాజంలో పల్లవరావువంటివాడు బ్రతగలడా అని! కానీ బ్రతగ్గలననీ-గొప్ప భవిష్యత్తుని కూడా సృష్టించుకోగలననీ నిరూపిస్తున్నాడిప్పుడు. ఎట్లాంటి వెధవ ఎట్లా మారిపోయాడు!!"

లాటరీలో లక్షరూపాయలు ప్రైజువచ్చినంత సంబరపడిపోయాను. అంతటి ఆనందం నా జీవితంలో ఇంతకు ముందెప్పుడూ పొందలేదు. పల్లవావృద్ధిలోకివస్తే చూసి సంతోషించే వాళ్ళల్లో నేను మొట్టమొదటివాణ్ణి!

"చాలా మంచివార్త చెప్పావు కిషన్. అలా ముందుకుపోయి కాఫీ తాగుదాం." అన్నాను, నా ఆనందాన్ని అదుపులో పెట్టుకోలేక.

"వెళ్దాం కానీ మరి ఈ రాత్రికి మకాం ఎక్కడా?" అన్నాడు నడుస్తూ.

"మకాంలేదూ ఏమీలేదు. ఇప్పుడే తిరుగు ప్రయాణం. వెంటనే బస్సుదొరికితే టౌనుకు వెళ్లేసరికి పన్నెండవుతుంది. అక్కడ్నుంచి ఒంటిగంట ట్రైనుకు అందుకుంటే తెల్లవారేసరికి విజయవాడలో వుంటాను.

"అంత తొందరేం? మా ఇంటికి రాకూడదూ."

"రావచ్చుగానీ, ఇప్పుడు వీలుకాదు. రేప

ఉదయాన్నే కంపెనీకి వెళ్ళాలి!"

"అదేమిటీ. లీవ్ పెట్టలా నాల్రోజులైనా?"

"పెట్టాను. కానీ ఎల్లుండి మా మేనేజింగ్ డైరెక్టర్, మరికొంతమంది ఉద్యోగులూ కలిసి బోంబే వెళ్తున్నారు, కంపెనీ పనిమీద. నన్ను కూడా రమ్మన్నారు కానీ, పల్లవరావుని చూద్దామని రానన్నాను. ఐతే ఇప్పుడు పల్లవరావుని చూట్టానికైనా వాళ్ళవెంట వెళ్ళక తప్పదు."

"ఎల్లుండే ప్రయాణమన్నమాట"

"ఔను. నామట్టుకు నాకు ఇప్పుడే వెళ్లి పల్లవా ముందు వాలితే బాగుండు నన్నంత ఇదిగా వుంది."

కిషన్ నవ్వాడు.

మెల్లగా అట్లామాట్లాడుకుంటూ బస్టాండు దాకా వచ్చాం.

ఇందాకటి హోటల్లోకివెళ్ళి ఫుల్‌గా టిఫెన్ చేసి, తీరుబడిగా కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగుతుంటే బస్సొస్తున్న శబ్దం వినిపించింది.

వెంటనే లేచి బిల్లు 'పే'చేసి బయటికి వచ్చాము.

టైము పావు తక్కువ తొమ్మిదైంది.

బస్సు ఆగింది. లోపలికి వెళ్లి కూర్చున్నాను. కిషన్ కిటికీ దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

"పల్లవరావుని మరీమరీ అడిగానని చెప్పవోయ్" అన్నాడు అప్పటికి పదోసారి.

బస్సు కదిలింది.

కిషన్‌తోపాటు నేనూ చేయివూపాను.

కొద్ది సేపట్లోనే స్పీడందుకుంది బస్సు. కిటికీలోనుంచి చల్లని గాలి తెరలు తెరలుగా వస్తూ గిలిగింతలు పెడుతోంది.

నా మనస్సు హాయిగా ప్రశాంతంగా వుంది.

* * *

తరువాత నాలుగు రోజులకు బొంబాయి నగరంలో అడుగెట్టాను. అక్కడో మిడిల్ క్లాస్ హోటల్లో దిగాము మేమంతా. మా డైరెక్టరు మాత్రం హెడ్డాఫీసువాళ్లు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బసలో విడిది చేశాడు.

మా పనులన్నీ చకచకా జరిగిపోతున్నాయ్. పదిరోజులు ప్రోగ్రాం వేసుకొని వచ్చాం. తీరా ఇక్కడి వాతావరణాన్నిబట్టి వారం రోజులకే తిరిగి పోవచ్చునని నిశ్చయించుకున్నాం.

పల్లవరావుని కలుసుకోడానికి పెద్ద చిక్కు ఎదురైంది.

వాడి ఎడ్రసు నాకు తెలీదు.

ఎక్కడుంటాడని వెదకను?

ఎవరో పెద్ద ఆర్టు డైరెక్టర్ దగ్గర సహాయకుడిగా పనిచేస్తున్నాడట. కానీ ఆ ఆర్టు డైరెక్టర్ పేరుకూడా నాకు తెలీదు. ఎట్లా కనుక్కోవడం మరి?

మా స్టాఫ్‌లో ప్రకాశానికి హిందీ వచ్చును. అతనితో నాబాధ మొరపెట్టుకున్నాను.

నా అదృష్టం. అతను గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. పైగా "హిందీ సినీఫీల్డులో నీఫ్రండ్ పనిచేస్తూండటం నిజంగా నీ అదృష్టం. గర్వకారణం" అంటూ ఏవేవో కబుర్లు చెప్పాడు.

అప్పట్నుంచీ ఖాళీదొరికినప్పుడల్లా ఊరంతా తిరగటం మొదలెట్టాము. చాలామంది కళాదర్శకుల చిరునామాలు సంపాదించాం అతి కష్టంమీద. ఈఅడ్రసుల తతంగం ముగిసేసరికే మూడురోజులు గడిచాయి. అంటే ఇంకా బొంబాయిలో వుండేది నాలుగు రోజులే.

ఈ నాలుగు రోజుల్లో పల్లవరావుని పట్టుకోగలనో లేదో.

మరో రెండ్రోజులు గడిచాయి. కొంతమంది ఆర్టు డైరెక్టర్లను కలిశాము. "పల్లవన్ అనే అతను ఎవరిదగ్గరో పనిచేస్తున్నట్లు గుర్తు. మిగతా వాళ్ళనుకూడా విచారించి చూడండి. పెద్ద కష్టమైన పనికాదు. తప్పకుండా మీ స్నేహితుణ్ణి కలుసుకుంటారు." అన్నారువాళ్ళు.

నా గుండెల్లో రైళ్లు పరిగెట్టాయి! పల్లవరావుని చూడలేనేమో?

బొంబాయిలో వుండేది ఇక రెండ్రోజులు మాత్రమే,

మర్నాడు—మా డైరెక్టర్ని కలిసి నా పరిస్థితి చెప్పాను....బాగా 'రిక్వెస్టు' చేయగా పర్మిషన్ ఇచ్చాడు ప్రకాశానికీ, నాకూ.

నాకెంతో ఆనందమైంది. కంపెనీ పని తప్పిపోయింది. ఆ టైముకూడా పల్లవరావు



కోసం కేటాయించవచ్చు.

టాక్సీ ఒకటి మాట్లాడాము చకచకా పని జరిగిపోతుందని.

మధ్యాహ్నం పన్నెండయ్యే సరికి—చాలా మందిని కలిశాం. అప్పటికి ప్రకాశం 'ఆకలి' అనడంతో—ఏదైనా మంచి హోటల్ దగ్గర ఆపమని చెప్పాము, టాక్సీవాడితో.

టాక్సీ ఓచిన్న రోడ్డులోనుంచి వెళుతోంది.

సెంటర్లోకి వచ్చేసరికి—ఓచోట నా కళ్లు ఆగిపోయాయి. నా కనుబొమ్మలు ముడి పడ్డాయి. టాక్సీ ఆపమని చెప్పాను డ్రైవరుతో.

సడన్ బ్రేక్‌తో ఆగింది టాక్సీ.

'బేక్' చేయమని చెప్పాను.

కొద్దిగా వెనక్కివచ్చి ఆగింది.

గబగబా టాక్సీలోనుంచి దిగాను.

రోడ్డు పక్కన పలుచపాటి గుంపు. ఆ గుంపు మధ్యన శుభ్రం చేయబడిన రోడ్డుమీద ఓ చిత్రకారుడు నటరాజు బొమ్మకు తుది మెరుగులు దిద్దుతున్నాడు : పరీక్షగా చూశానతన్ని!

ఏదో అనుమానం నాలో!

ఇంకా దగ్గరికివెళ్లి చూశాను—నా అనుమానం నిజమైంది!

అంతే—ఆకాశం ఉరిమి పిడుగుల వర్షం కురిపించినట్లు—నా పక్కనుంచి ఎడ తెరిపి లేకుండా ఫిరంగి గుళ్ళుదూసుకుపోతున్నట్లూ-వణికిపోయాను' అదిరిపడ్డాను! చలించిపోయాను'! వళ్ళంతా చల్లబడి బిగుసుకుపోయింది!

ఆ చిత్రకారుడు ఎవరో కాదు.

పల్లవరావు!

నా ప్రియ మిత్రుడు—

ఇప్పుడు వీథుల్లోపడి, తన కళావైభవాన్ని, తన ప్రజ్ఞాపాటవాన్ని — పదిమంది నడిచే రోడ్డుకు అంకితంచేస్తూ పరోక్షంగా ముష్టెత్తుకు బ్రతుకుతున్నాడని గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు.

నా మనసులో తుఫాను రేగింది! అల్లకల్లోలమవసాగింది!

నా చెవులలో సుడిగాలి హోరు—సముద్రపు ఘోష—వినిపిస్తున్నాయి, స్పష్టంగా.

ఆషాక్‌నుంచి తేరుకోలేకపోయాను.

రెండు నిముషాలు గడిచి వుంటాయి.

పల్లవరావు దరిచేరి పలకరించే సాహసం ఇప్పుడు నాలోలేదు. నిలబడ్డచోటనుంచి ఒక్క అడుగుకూడా ముందుకు వేయలేని దౌర్భాగ్యపు పరిస్థితి!


పల్లవరావునే చూస్తున్నాను. వాడు మాత్రం నావైపు చూడటంలేదు. నా ఉనికే వాడికి తెలిసే అవకాశంలేదు. ఆ పదిమందిలో నేనూ ఒకణ్ణి.

మరొక్కక్షణంకూడా అక్కడ వుండలేకపోయాను.

నా హృదయంలోనుంచి ఉబికి ఉబికివస్తున్న ఉద్వేగాన్ని నిభాయించుకోవడానికి ఎంత ప్రయాస పడ్డానో.

జేబులోకి చేయిపోనిచ్చి యాభైరూపాయల నోటు బయటికి తీశాను.

రోడ్డుమీద నటరాజు బొమ్మ ఎంతబావుందో నేను గమనించలేదు.




దానిమీద విసిరివేయబడ్డ - పదీ, ఐదూ, మూడూ, రెండూ పైసల్నే చూడగలిగాను.

బొమ్మకింద "ప్లీజ్ హెల్ప్ మీ" అని ఇంగ్లీషులో వ్రాయబడ్డ చిన్న చిన్న అక్షరాల్నే చూడగలిగాను!

యాభై నోటు ఆ చిల్లర పైసల మధ్యకు వదిలాను ! అందరి చూపులతోపాటు పల్లవరావు చూపులూ నాకు గుచ్చుకున్నాయి.

మరో షాక్ తగిలింది—వాడికళ్ళు నా కళ్ళతో కలవగానే.

రివ్వున వెనక్కి తిరిగి టాక్సీ ఎక్కాను.

ప్రకాశం ప్రశ్నల వర్షం కురిపించాడు—"ఏమిటి. ఏమయింది? ఎవరతను?" అంటూ.

నేను మాట్లాడలేదు.

టాక్సీకదిలి ముందుకు దూసుకుపోతోంది,

ఏమిటి ఇట్లా జరిగింది?

కిషన్ నాతో చెప్పిందేమిటి?

ఇక్కడ నేను చూసిందేమిటి?

రెంటికీ సంబంధమేలేదు!

అతనికి ఎవరో చెప్పారట!—అంటే పల్లవరావు ఆర్టు డైరెక్టర్ కావడం పెద్ద 'పుకారు' అన్నమాట! అవును. పదిమంది నోళ్ళల్లో నానేసరికి నిజం తన స్వరూపాన్ని పూర్తిగా కోల్పోతుంది-

మరి పల్లవరావు ఎందుకిట్లా అయ్యాడు? ఎందుకింత - దిగజారాడు? సొంతవూరు వదలి వచ్చిన తరువాత అభివృద్ధి లేకపోగా అథః పాతాళానికి ఎందుకు అణిగిపోయాడు?

టాక్సీ వేగంగా వెళ్తోంది.

కిషన్ పల్లవరావు గురించి మాట్లాడిన మాటలు గుర్తుకొచ్చాయి నాకు—

"నిజానికి పల్లవరావు మామూలు సమాజంలో చలామణీ కాలేడు. అట్లాంటి తత్వం వాడిది. నోరు తెరిచి అడగందే 'అమ్మైనా' అన్నం పెట్టదు కదా అట్లా అడగటానికి కూడా నోరులేదు వాడికి. ఎంతసేపటికీ కళారాధన కళాసేవ—అనుకుంటూ కూర్చుంటే పొట్ట గడవదు కదా. మన కళారాధనను చూసి ఎవ్వడూ సంతోషించడు, కనికరించడు. పైగా పిచ్చోడని నవ్వుకుంటారు, దూరంగా తరిమేస్తారు. ఎంతకీ—నాలుగు మాటలు చెప్పగలిగినవాడే 'టేలెంట్' లేకపోయినా బ్రతగ్గలడు కానీ—అమోఘమైన టాలెంట్ వుండీ మాటలు చెప్పటం రాకపోతే—అలాంటివాడు 'అన్ ఫిట్ ఫరెనీథింగ్' . అందుకే అంటారు—'కాకా రాయుళ్ళకున్న ఎలువ కళాకారులకు లేదని!".

☐